భాణము

# నైట్ డ్యూటీ

గోరాశాస్త్రి

(దూరాన గాలిలో తేలి వచ్చే రైలు ఇంజనుల అరుపులు. గంటలు)

హమ్మయ్య! పంపించేశాం యింకో రైలుబండిని. మన గడప దాటి పోయింది. ఇంక దానిష్టం. చీకటిని చీల్చుకుంటూ, గాలిని యీడ్చుకుంటూ పరిగెత్తనీ - మనకేం? అర్థరాత్రి కావస్తోంది. అబ్బే లేదు—యింకా పదకొండున్నర కాలేదుగా. స్టేషను మాష్టరుగారి భోజనమే అయుండదు... కాస్సేపట్లో సిద్ధం అవుతాడు చతుర్ముఖ పురాణంకోసం. ఈలోపుగానే ట్యూబ్‌లో క్యాష్ సరిచూసుకుని లెడ్జర్ క్లోజ్ చేసుకుంటే సరి...అందుకే అంటాడు చారీబాబు — "కామేశ్వర్రావ్, నీ హస్తవాసి మంచిదోయ్, నువ్వు టికెట్లు బుక్ చేస్తే నాలుగు డబ్బులు మిగులుతాయిగాని తక్కువరావు—మంచి హస్తలాఘవం"-అంటూ ఊబ్బేసి "పడేయ్ మరి టీకి డబ్బులు"-అంటాడు.

రాత్రి ఎంతబావుంది! ఎంత హాయిగా ఉంది! యీ ప్లాట్‌ఫారమ్‌మీద! రాత్రి నిజంగా చల్లని తల్లి. దూరాన నగరం నిద్రపోతోంది. వెయ్యి కాంతుల వెయ్యి రంగుల వెయ్యి కన్నీళ్ళ మహానగరం. మహానగరం చివర ఒంటరిగా యీ రైల్వేస్టేషన్. దీన్ని అంటిపెట్టుకుని గుడ్లగూబల్లా అరడజను మనుషులం. అతి ముఖ్యమైన డ్యూటీ చేస్తున్నాం- క్షణం విరామంలేకుండా యిలా సృష్టిచక్రాలు తిప్పేస్తున్నాం- పగలూ రాత్రీ కాలయంత్రంపలె చక్రాలు తిరిగిపోతున్నాయి- రైళ్ళు పరుగెడుతున్నాయి. సామాన్లు రవాణా అయిపోతున్నాయి- మనుషులు అలా ఎక్కడికో ప్రయాణం చేసేస్తున్నారు.

ఏం బాబూ? అగ్గిపెట్టా—ఓ దానికేం భాగ్యం—యిందు. వెలిగించు నాయనా వెలిగించు—పూర్వే అగ్నీ—పశ్చాత్ ధూమా...అన్నాడుగదా ఋషీ! వాళ్ళకీ సిగరెట్ల సంగతి తెలిసే ఉంటుంది. వాళ్ళేం తక్కువవాళ్ళా. అలా అంటే మా స్టేషను మాష్టరు ఒప్పుకోడు — నేనుమాత్రం ఋషిలాంటివాణ్ణి కానురా! అంటాడు. అదీ నిజమే ననిపిస్తుంది. అతను ఋషిలాంటివాడు కాదనడానికి ఎవరికి దమ్ములున్నాయి? స్టేషను మొత్తంమీద పేరు మోసిన అంజనేయ భక్తుడు. పదకొండుగురు సంతానం- రిటైరయే టైమొచ్చేసిందిగాని-సంసార ఝంఝూటంలోంచి రిటైరు కాలేకపోతున్నాడు. అంతా భగవదిచ్ఛ అనుకో కామేశ్వర్రావ్. మన డ్యూటీ మనం చేసుకు పోవాలి అంతే. అంటాడు. డ్యూటీ— ఆమాటంటే ఆయనకి చాలా యిష్టం.

అరె—వీడెవడు? ఓ—జమాదారు వీరాస్వామి. చీకట్లో చూడలేదు. హాయిగా తలగుడ్డ పరుచుకు నిద్రపోతున్నాడు. ఈ స్టేషనులో ఏమిటో అందరం ఒక్కలాంటి వాళ్ళం చేరాం- ప్రతి ఒక్కడూ వీరభద్రుడే. వీరాస్వామి ప్రత్యేకత హాయిగా నిద్రపోవడం. నోట్లో చుట్ట వెలుగుతూనే ఉంటుంది. హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతూ ఉంటాడు. క్యాబిన్‌లో పాయింటు లాగుతూ నిద్రపోతాడు. టోకెన్ బత్తీ వెలిగిస్తూనే నిద్రపోతాడు ...వీడి జీవితాశయం నిద్ర — పడుకో వీరాస్వామీ పడుకో ... మేలుకుంటే ఏముంది? నీకు జన్మల్లా పాయింట్లు లాగడం, దీపాలు వెలిగించడం, నాకు జన్మల్లా టికెట్లు అమ్మడం-అంతే గద. హాయిగా పడుకో. మనిషన్నవాడు రాత్రి నిద్రపోక ఏం చేస్తాడు?

ఆఁ అది పాతకాలం మాట. మనం నాగరికులం. పగలూ రాత్రీ అదే పని చేసేస్తాం. నిద్రపోము. మనుషులకి ఎడతెరిపి లేకుండా పనులున్నాయి, కాబట్టి రైళ్ళు ఎడతెరిపిలేకుండా పరిగెడతాయి. అంచేత నాలాంటి వాళ్ళు కళ్ళల్లో వత్తులు పెట్టుకు మేలుకుని ఉండాలి. డ్యూటీ చెయ్యాలి. నేను టికెట్లు అమ్మాలి—పార్సెల్సు లోడ్ చేయించాలి, మా చారీబాబు టోకెన్లు యిచ్చి రైళ్ళు రప్పించాలి, మళ్ళీ పంపించేయాలి-

ఎంత ముఖ్యమైన పని! అదిగో మా చారీబాబు ఎందుకో కుర్చీలో కూర్చుని నవ్వుకుంటున్నాడు.

ఏం చారీబాబూ? ఏవో జ్ఞాపకం వచ్చి నవ్వుకుంటున్నావా? అవును పాపం పగల్లా అక్కడక్కడ తిరిగి రంగు రంగుల నత్తగుల్లల్ని వెతుక్కుంటూ చప్పుడైతే గతుక్కుమంటావు. వాటిని నువ్వు ఏవేవో పేర్లతో పిలుస్తావుగాని—చందమామలూ సీతామ్మవారి కుప్పెలూ అని-ఆఖరికి అన్నీ ఒక్కటే! అదే నీ కిప్పుడు జ్ఞాపకం వస్తోంది. నవ్వుతున్నావు. ఈ అర్థరాత్రివేళ నీ అంతరాంతరాలలోని కోర్కెలు ధైర్యంగాలేచి బృహదాకారం దాల్చి నిన్ను ఆవరించుకున్నాయి-పగల్లా కష్టపడి పోగుచేసుకున్నవన్నీ నత్తగుల్లలని తెలుసుకుని విసిరి అవతల పారేస్తున్నావు—అందుకే నవ్వుతున్నావు అవునా?

ఏంవంటావు చారీబాబూ? రమ్మంటావా అక్కడికీ! ఎందుకూ? చాకిరీచెయ్యడానికి. అవునా? నేను రానుబాబూ. నా రికార్డండా క్లోస్ చేసుకున్నాను-పనంతా అయిపోయింది. త్రూ ప్యాసింజెరూ, కోచీ, బుక్ చేసేస్తే అంతే—హాయిగా కౌంటరుకి కాళ్ళు చాపుకొని కునుకు తీయొచ్చు. తెల్లారకట్ల లేచి యింటికి ఉడాయించవచ్చు. కాస్సేపట్లో మా ఎస్. ఎమ్. వస్తాడుగా. కావలసినంత కాలక్షేపం నీకు. కాస్సేపు నన్నిక్కడేఉండనీ ప్లాట్‌ఫారమ్ మీద పచారు చేస్తూ గాలి పీల్చుకొంటాను. సిగరెట్లు కాలుస్తూ, ఆలోచిస్తూ. నువ్వు కూడా బైటికి రారాదూ? ఆ గదిలో కూర్చుని హాలో కంట్రోల్-దిస్-యీజ్-అని అరవకపోతే గుడ్లగూబలాగ? బయటికి రా-యీ వెన్నెల ఎంత బాగుందో చూడు. ఏమి వెన్నెలయిది. ఈ గౌడదేశపు వెన్నెల ఎంత చల్లగా ఉంటుంది. లాలించి గిలిగింతలు పెడుతుంది చారీబాబూ. పైగా ఏవేవో జ్ఞాపకాల కురుపుల్ని రేపి బాధపెడుతుంది కూడా. ఇందాక యించుమించు అంతే జరిగింది-డౌన్ ప్యాసింజెర్‌కి ఫస్టుబెల్ కొట్టేశారు. హడావుడిగా ఓ ఆవిడ వచ్చింది, ఏమంటావు? వయస్సు ఎంతంటావా? ఏం చెప్పగలం చారీబాబూ. అసలే యింకా యీ యవ్వనం అనే జబ్బుతో బాధపడుతున్నానా—అందులో యీ ఎలక్ట్రిక్ దీపాల కాంతిలో ఏం చెప్పగలను? ఇది నైలాన్ చీరల శుభ్ర సౌందర్యాల యుగం, ఏం చెప్పగలం? అప్పుడే వికసించిన పారిజాతం గర్భంలో యిరుక్కున్న నీటిబిందువు వయస్సెంతో చెప్పగలవా? నువ్వు చెప్పగలవులే-మీసాలకు రంగు వేస్తున్నావుగా—అంచేత కాలాన్ని సరిగ్గా కొలిచి జయించేశావు. పోనీలే యీ కవిత్వం అంతా దేనికిగాని ఆవిడ వచ్చింది. మొగల్‌సరాయికి టికెట్ ఎంతండీ అంది. గతుక్కుమన్నాను—ఎక్కడి మన స్టేషను-ఎక్కడి మొగల్‌సరాయి! బహుశా దీనిని మొదట కట్టించింది తూర్పు చాళుక్యుల కాలంలో ఐయుంటుంది. ఎంత దూరం ప్రయాణం చేస్తోంది ఆ అమ్మాయి! ఏవేవో వెర్రి ఆలోచనలు బుర్రలో కొచ్చాయి. కౌంటర్‌లోంచి నాలుగు పది రూపాయల నోట్లు అందించింది. ఇవిగో యాభై-అంది. ఆశ్చర్యపోయాను; నాలుగు నోట్లే అంటాను నేను ఐదంటుంది,ఆవిడ. నూటపది రూపాయిల జీతగాణ్ణి పది రూపాయల్ని ఎక్కడ తెచ్చుకోను? మా తగాయిదా వింటున్న ఆమె భర్త కాబోలు మరి-వచ్చి, పర్సులో నోట్లూ అవీ పదిసార్లు లెక్కపెట్టి ఏవేవో లెక్కలు చూసుకుని నా మాటే రైటన్నాడు. అప్పుడనుకున్నాను-బతికిపోయానని.

ఏమనుకోవాలి ఆవిడ గురించి? కావాలనే అబద్ధమాడిందనుకోనా? పరాకు పడిందనుకోనా? నేను చూస్తూండగానే నాలుగు నోట్లూ లెక్కపెట్టి అయిదంది...ఒరేయ్-లోటాదాస్ - గాడిదా ఏదీ ఓ కప్పు టీ అందుకో-వేడివేడి టీ. ఈ అజ్ఞాన లోకానికి తెలీదుగాని మా లోటాగాడి డబ్బా టీ ఉందే-అమృతం అంటే మరేమిటి నాకు తెలియకడుగుతానూ? నా నైట్ డ్యూటీలో నన్ను రక్షించేవి మా స్టేషన్‌మాస్టారి డ్యూటీమీద లెక్చర్లూ వాటికి విరుగుడుగా లోటాగాడి టీ కప్పులూ.

పాపం - వా డెప్పుడూ తప్పుడు లెక్కలు రాయడు. ఒరేయ్ దీనితో నాలుగు కప్పులా-మూడా అంటే ఏటి బాబూ లెక్క సరిగ్గా తేలకపోతే ఓ కప్పు ఎక్కువే రాసుకుంటాను పద్దులో అంటాడు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఎప్పుడూ తనకే యిచ్చుకుంటాడు...

ఇంక పోవాలి లోపలికి. మేస్టారు వస్తారు. మహానుభావుడు. వస్తూనే మమ్మల్నందర్నీ ఒక్క-

సారి ఆశీర్వదించేస్తాడు. మా జనన వృత్తాంతా లానుకూడా శంకిస్తాడు. మీరంతా గుడ్లగూబలురా అంటాడు. అవును కాబోలనుకుంటాం మేము. చారిబాబు నావేపు చూసి నవ్వుతాడు. వీరాస్వామి సరే-వాడికి ఎలా తెలుస్తుందో మరి—యార్డులో ఎన్ని యింజన్లు కూసినా, ఎన్ని గూడ్సు బళ్లు వచ్చినా, పోయినా నిద్రలేవనివాడు స్టేషన్ మాస్టరు అడుగులచప్పుడు వినేసరికి లేచి కూర్చుంటాడు. వాళ్లిద్దరికీ ఉన్న ఆధ్యాత్మిక సంబంధం అటువంటిది-మళ్లీ అందుకుంటాడు మా ఎస్. ఎమ్. "వెధవలు. మీరు గుడ్లగూబలు కాదు-పిశాచాలు: పిశాచాలురా మీరంతా!" అంటాడు-యీ నైట్ డ్యూటీ అన్నది మేమేదో కావాలని కనిపెట్టినట్లు. పోనీ తను హాయిగా యింట్లో పడుకోరాదూ? ఊహు. ఆఫీసు పనంతా కూర్చుని అర్థరాత్రి చేస్తానంటాడు. ఆయనకు మేమంతా హాంగుదార్లం. ఫైళ్లకట్టలు ముందు పెట్టుకుని కూర్చుంటాం-చారిబాబూ, ఎస్. ఎమ్, సీతారామస్వామీ, పార్శెల్ బాబూ అంతా చతుర్ముఖ హడావుడిలో ఉంటారు. క్లెరికల్ వర్కంతా నా నెత్తిమీద.

సార్ కోడిగుడ్ల కేసుమీద హెడాఫీసునుంచి మూడో రిమైండరు వచ్చిందండీ అంటాను నేను.

చింపెయరా అంటూ డాయన, డ్రైమానురాణీ వేపు ఓరగా చూస్తూ.

సార్ గ్యాస్ సిలెండర్ల మర్చెంటు రెండో రిజిస్టరీ ఉత్తరం రాశాడు అంటాను.

కాల్చెయరా అంటాడాయన, వీరాస్వామి ఒలిచిపెట్టిన నారింజతొనలు ఆరగిస్తూ...

ఇంకో ఘాటైన ఉత్తరం సంగతి చెపితే నమిలి మింగేయరా అంటాడు. ఇద్దరం కలిసి ఆఫీస్ కరస్పాండెన్సు అంతా అలా పరిచూసేస్తాం.

* * *

హమ్మయ్య. త్రూ ప్యాసింజెరుని కూడా పంపించేశాం. కరివేపాకు బుట్టలూ, కోడిగుడ్ల బుట్టలూ, కొవ్వు డబ్బాలూ, సంపెగపువ్వుల బుట్టలూ యివన్నీ సారె యిచ్చి అత్తారింటికి పంపించేశాం - పదహారు వందల రూపాయల క్యాష్. నల్భైనిమిషాల్లో బుక్ చేశాను. బుక్ చేస్తేకామేశ్వర్రావే బుక్ చేయాలి బుకింగ్ ట్యూబ్ దద్దరిల్లిపోతూంది. పంచింగ్ మిషిన్ టకటకటుక ఒకే ధృతిలో సంగీతంలాగ-అగ్నిమిత్రుడి ఆస్థానంలో మాళవిక డాన్సులాగ-ఎంత కమ్మగా ఉంటుందిరా, అంటాడు మా చారీ బాబు. మళ్ళీ వెంటనే చూడు కామేశ్వర్రావ్, ఎక్సెస్ ఎంత వచ్చింది? అంటాడు. ఎక్సెస్ ఎలా వస్తుంది చారీబాబూ? అంటాను ఏమీ తెలియనట్లు. అప్పుడప్పుడు ఎక్సెస్ వస్తుంది మరి. ఇరవై రూపాయల్లో పదమూడు రూపాయల పదకొండణాలు పోతే మిగిలింది ఆరుంపావలావో, ఐదుంముప్పావలావో, ఆ అర్థరాత్రివేళ కంగారులో ఎవరికి జ్ఞాపకం ఉంటుంది! కౌంటర్ ఆవతల మనిషీ నేనూ ఒకే ఆవేశంలో ఉంటాం. నీతిలేని రాతిరిలో చాలా లెక్కలు తబ్బిబ్బులౌతూ ఉంటాయి, అలా మిగిలిన దక్షిణ ఏమైనా ఉంటే అది ఉదయాన కాఫీసేవనానికి పనికొస్తుంది.

ఈ అర్థరాత్రి నేనిక్కడ ఏంచేస్తున్నట్లు? నగరమంతా హాయిగా నిద్రపోతోంది. దీపాలు ఆరిపోయాయి. పాపాయిలు నిద్రపోయారు. వాళ్ళ తల్లులూ నిద్రపోయారు. నే నొక్కడినే యిలా మేలుకొనిఉన్నాను. ప్లాట్‌ఫారమ్ నిర్మానుష్యంగా ఉంది. డిస్టంట్ సిగ్నల్ దూరాన ఎర్రగా మినుకు మినుకుమంటున్నవి—నా గుండెలో ఎర్రఎర్రని కోరి కల్లాగే. అయితేనేం—వాటిని అలాగే ఉంచుకుని డ్యూటీచెయ్యాలి. ఎమిటా డ్యూటీ! టిక్కెట్లు అమ్మడం. ఎవరికి? అదృష్టవంతులైన ప్రయాణికులకు. వాళ్ళు హాయిగా ఊళ్ళు వెళతారు, నేనిక్కడే ఉండిపోతాను. సైన్‌పోస్టులాంటివాణ్ణి. నువ్వు ఏ దిక్కుగా ప్రయాణం చెయ్యాలో సైన్‌పోస్టు చెపుతుందికాని, తను పాతిపెట్టిన చోటనే ఉండిపోతుంది. నేనూ అంతే.

గాలి మళ్ళింది, తెల్లవారుజాము గాలి. చల్లగా చుర్రుమంటోంది. అన్ని బళ్ళూ వెళ్ళిపోయాయి. పెనుచీకటిలో రాకాసి చక్రాలు తిప్పుకుంటూ వెళ్ళిపోయాయి. ఆఖరు పాసింజెరు కూడా వచ్చేసింది నిద్రమత్తు ప్రయాణీకుల్ని దించేసి. రాత్రిపూట యీ స్టేషనుకి నేనే మకుటంలేని మహారాజుని. అనగా టిక్కెట్టులు అమ్మడం, గేటు దగ్గర నిలబడి వసూలుచెయ్యడం—పార్శెళ్లు ఎక్కించడం. దించడం—అన్నీ మనమేగదా! అంతపనీ అయిపోయింది.

పాపం, ఇందాక గేటుదగ్గర ఆ అమ్మాయి—గేటుదగ్గర బెదురుతూ టిక్కెట్టు పారేసుకున్నానండీ అంది చిరునవ్వుతో. రోజూ అదే బండిలో వస్తుంది—అలాగే అంటుంది. నేను, సరేలే చిట్టితల్లీ! సెలవుతీసుకో అంటాను. ఏంచెయ్యగలం అంతకంటే? కాళరాత్రి కుచముల్ గగుర్పొడిచి మహాదేవ నిశామారుతమ్ములు వీచే తృతీయ యామంలో యీ సమస్త సృష్టిమీదా ఎందుకో జాలి కలుగుతుంది. ఒక్కసారిగా అందర్నీ క్షమించెయ్యాలనిపిస్తుంది——ఆఖరికి మా చారీబాబును కూడా.

నాలాగే యీ నగరంలో యింకా ఎందరు మేలుకొని ఉన్నారో! మిల్లులు పనిచేస్తాయి, అక్కడి మహా యంత్రాలు విరామం లేకుండా తిరుగుతాయి, ఆసుపత్రి రోగుల రక్తనాళాల్లో కాస్త శాంతివస్తుందేమో-యీ రాత్రివేళ. వాళ్ళను కనిపెట్టే నర్సులు అలా నిద్రలేనిమత్తులో కూర్చుంటారు—దాహార్తుడికి మంచినీళ్ళిచ్చి, బాధార్తుడిని ఓదారుస్తూ—ప్రపంచ వార్తలను అతి అర్జంటుగా టెలిగ్రాఫ్ తీగెలు పత్రికా కార్యాలయాలకి మోసేస్తూంటాయి. అక్కడివాళ్ళంతా మేలుకొని ఉండి ఏవేవో కొంప ములిగిపోయే వార్తలన్నీ రాసేస్తున్నారు. ఏమిటో యీ హడావిడంతా. ఎక్కడికో యీ సంరంభానికి అవధి? ఈ ఆసుపత్రులూ — యీ కర్మాగారాలూ — యీ రైల్వే స్టేషనులూ — యివన్నీ నా కనుపిస్తాయి—నిద్రపట్టని మన నాగరికతకి కురుపుల్లాంటివని.

ఈ రాత్రి జీవనానికి అలవాటు పడి పడి పగలు చూస్తే లోకం అదో మాదిరిగా ఉంటుంది. ఏది వాస్తవికతో ఏది కలో తెలియదు. రాత్రి ఒక్కటే నిజం. తక్కినదంతా అబద్ధం అనిపిస్తుంది. మళ్ళీ యీ స్టేషన్ పొరపాటున సూర్యకాంతిలో చూస్తే అంతా కొత్తప్రదేశంలా ఉంటుంది. స్టేషన్ అంటున్నానా—మనుషులూ అంతే—పగటి మనిషి వేరు—రాత్రి మనిషి వేరు. సూర్యకాంతిలో చెయ్యడానికి భయపడేవెన్నో దీపకాంతిలో చెయ్యడానికి భయపడడు మనిషి. అలాగే యీ తృతీయ యామంలో చైతన్యరహితమైన యీ ప్రకృతి మనలోని ప్రశాంతతని దేనినో కదిపి పగలల్లా మనం పడిన కోటి భయాలనూ తీసేస్తుంది. చేతనం -- అచేతనం — రెండూ ఒకటేననిపిస్తుంది. అప్పుడే గీతాకారుడి శ్లోకం—లోకం మేలుకున్నప్పుడు యోగి నిద్రపోతాడనీ, లోకం నిద్రపోయినప్పుడు యోగి మేలుకుంటాడనీ-జ్ఞాపకం వచ్చి——

నేనుకూడా నైట్‌డ్యూటీలో ఉన్న యోగినే అనుకుని తృప్తిపడతాను.

(ఆలిండియా రేడియో ప్రసారితం) ★

---

(16వ పేజీ తరువాయి)

వ్యవహారాలంటే అసహ్యం. అసలు యిండియాలో పుట్టేమని కించపడేవాళ్ళుకూడా లేకపోలేదు. ఎవరైనా అంతేనేమోలెండి; పొరుగింటి పుల్లకూర రుచి తంతు. నల్ల దొరలు తెల్లవారి పోకడలు పోలేక నానా అవస్థా పడుతూంటే, తెల్లవారు నల్లవారి ఆధ్యాత్మికతనీ, అమాంబాపతు నమ్మకాలను నమ్మాలనీ, అవలంబించాలనీ పాటుపడుతున్నారు.

ఇంతకీ యీ లోకపు సర్వనాశనానికి యింకా మనం యుగధర్మాలను నమ్ముతూన్నాం. వారు మటుకు ఏటంబాంబులూ హెచ్. బాంబులూ చాలుననుకుంటున్నారు.

కల్పాంతం తరువాత పునఃసృష్టి-కల్పాంతానికి కారకుడు లయకారుడయిన శివమూర్తీ, పునఃసృష్టికి కారకుడు బ్రహ్మమూర్తీ - అందరూ విష్ణుస్వరూపాలే మనకి. కాని వారికి యాటం రిసెర్చి పెద్దలూ, సరికొత్త ప్రయోగాలూ చాలు-సృష్టికీ, సృష్టి అంతానికీ కూడా.

ఏంజరిగినా పునర్జన్మ తప్పదు కనుక మనం జాగ్రత్తపడాలి. జర్మన్‌లో ఒక కథ వున్నదట: యింట్లో పందిని కోసుకుంటూన్న సందర్భంలో యింటి పెంపుడుకుక్క యీనిందట. తక్షణం యీ పంది ఆత్మ ఆ కుక్కపిల్లలో ప్రవేశించి, కుక్కపిల్లలు పంది అరుపులు మొదలెట్టాయట.

ఎటొచ్చీ అంతా యీపునర్జన్మలను నమ్మేసి పూర్వ జన్మలని గుర్తించేస్తే గట్టిచిక్కే: యీ జన్మలో అస్తమానం స్నానాలు చేసే అత్యాచారవంతురాలయిన బామ్మగారు గతజన్మలో 'చేప' అంటాడు అన్న. కాదు - చాకలిదయి వుంటుంది అంటుంది అక్క. ఏది సత్యం? ఏ దసత్యం?

—(రుద్రాణి)